కథ

# సరస్వతీ నమస్తుభ్యం

- బి.వి.స్వరూప్ సిన్హా

**ఆ సాయంకాలం కాలేజీ స్టాఫ్ రూములో పది మందికీ చర్చనీయాంశమైన విషయం రాజశేఖరం మాస్టారికే మాత్రమూ ఆసక్తిని కలిగించలేదు! మిగతా లెక్చరర్లు కూడా ఆ విషయాన్ని ఆయనతో చర్చించలేదు. వారి దృష్టిలో ఆయనొక కొరకరానికొయ్య. 'మనకెందుకులే... మరో అయిదేళ్లలో రిటైరయ్యే పెద్దమనిషితో' అనుకున్నారు.**
**ఆయన తన చేతుల్లో ఉన్న 'వేయిపడగలు' చదవడంలో పూర్తిగా నిమగ్నమై పోయి ఉన్నారు. అడపాదడపా కొందరు సైన్సు, మ్యాథ్స్, ఇంగ్లీష్ లెక్చరర్ల మాటలు ఆయన చెవిని పడుతూనే ఉన్నాయి.**

''వాట్‌ప్లెజర్ హీ గెట్స్ బై రీడింగ్ చట్ ఓల్డ్ స్టఫ్...?''

''డోంట్ నో యార్...! నెవెర్‌సీన్ సచ్ ఎ బుక్ వార్మ్...'' ఇద్దరి సంభాషణలో కల్పించుకుంటూ ఓ కుర్ర లెక్చరర్ అన్నాడు. ''డోంట్ సే లైక్ దట్... ఓల్డ్ ఈస్ గోల్డ్..'' మాసికల జీన్సు ప్యాంటును జారిపోతుండగా పైకి లాక్కుంటూ... కాసేపయ్యాక ఆ కుర్రాడే రాజశేఖరం గారినుద్దేశించి అన్నాడు.

''మీకు తెలుసుగా సార్... మన కాలేజీలో అయిదేళ్ల క్రితం ఫస్ట్ బ్యాచ్ చదివిన స్టూడెంట్స్ 'ఓల్డ్ స్టూడెంట్స్ డే' జరపబోతున్నారు''

ఆయన కళ్లజోడు సవరించుకుని చెప్పారు- ''అలాగా... చాలా సంతోషం...''

''వాళ్లు మిమ్మల్ని ఇన్వైట్ చెయ్యడానికొచ్చినప్పుడు మీరు లీవులో ఉన్నారు. అందువల్ల నన్ను మీకు చెప్పమన్నారు. ఆదివారం సాయంకాలం నాలుగింటికి మీరు తప్పక రావాలట''. భుజాలెగరేసి తన బాధ్యత తీరిపోయిందన్నట్లు మళ్లీ కబుర్లలో పడ్డాడు.

మాటల మధ్యలో ఎవరో అంటున్నారు. ''ఆయనకంతగా గుర్తుపెట్టుకుని చెప్పాల్సిన పనిలేదు... ఆ ఓల్డ్ స్టూడెంట్సంతా ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులు చదువుతున్న వాళ్లు. ఈ తెలుగు మాస్టారితో వాళ్లకేమంత 'క్లోజ్‌నెస్' ఉండదు. చెప్పినా చెప్పకపోయినా వాళ్లేమంతగా ఫీల్ కారులెండి''.

అప్రయత్నంగా చెవిన పడుతున్న వారి మాటలను వింటూ ఆయన నిర్లిప్తంగా తన పుస్తకంలో లీనమయ్యారు. ఒక్కసారిగా చదువుతున్న పుస్తకంలోని పేజీలు ఆయన గతం తాలూకు జ్ఞాపకాల పుటలుగా మారిపొయ్యాయి..

అవి రాజశేఖరం గారు పదో తరగతి పాసైన రోజులు. అప్పుడప్పుడే ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులకు తల్లిదండ్రులు కొంచెం ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్న రోజులు.

''మన శేఖరం ఇంజనీరింగ్ చదవనంటున్నాడండీ కాస్త మీరయినా నచ్చ జెప్పండి''.

కాలేజీలో అడ్మిషన్ కొరకు అప్లై చేద్దామనుకుంటూండగా తల్లిమాటలు ఆయన చెవిని పడ్డాయి.

''అదే... నేనూ చెప్పి చూసాను. బాబు వినడం లేదు. తనెంతసేపూ ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూప్‌తో చదివి ఆ తర్వాత బి.ఎ., ఎం.ఏ తెలుగు సాహిత్యం చదువుతానంటున్నాడు. లెక్చరర్ నవుతానంటాడు'' తండ్రి బాధగా చెప్పాడు.


''మరోసారి చెప్పండి... ఏ డాక్టరో, ఇంజినీరో అవుతే సంఘంలో ఆ గౌరవం వేరు...''

''అమ్మా... లెక్చరర్స్‌కు కూడా సమాజంలో ఎంతో గౌరవం ఉందిగా తల్లీ'' శేఖరం తాతగారు కోడలికి నచ్చ చెప్పబోయారు.

''ఉండొచ్చు నాన్నా... కానీ... కాలం మారుతోంది. ఇప్పుడు కాలేజీల్లో చేరేవారంతా ఏ ఎం.పి.సియో లేక బై.పి.సియో తీసుకుంటున్నారు తప్ప ఇలా మన శేఖరంలా ఆర్ట్స్ గ్రూప్‌లో చేరాలనుకోవడం లేదు. పిల్లవాణ్ణి మనం అలా చేర్పిస్తే మాకు నలుగురిలో, ముఖ్యంగా మా కొలీగ్స్‌లో చాలా నామోషీగా ఉంటుంది. చాలామంది నవ్వి పోతున్నారు ఇప్పటికే ఈ సంగతి తెలుసుకుని...''

''మరేనండీ... బాబు ఆలోచన ఇలా ఉందని తెలిసి మన ఇరుగూపొరుగూ కూడా ముక్కున వేలేసుకుంటున్నారు'' మామగారి నుద్దేశించి అన్నది తల్లి.


''అలాకాదమ్మా... అబ్బాయి కిష్టమైన కోర్సులో చేర్పిస్తే మనసు పెట్టి చదువుతాడు. ఏదైనా యిష్టపడి చదివితే ఒంటబడుతుంది గానీ కష్టపడి చదివినా మనసుపెట్టి చదవక పోతే ప్రయోజనం లేదు కదా? వాణ్ణి చక్కగా చదువ



కుని నాలా తెలుగు మాస్టారు అవనీయండి. అప్పుడు మన కుటుంబానికే కాదు సమాజాని క్కూడా ఉపయోగం ఉంటుంది!'' అన్నారాయన.

''సరేలే నాన్నా... మీ యిష్టప్రకారమే కానీయండి'' నిట్టూర్చారు శేఖరం తండ్రి గారు.

కానీ తల్లికి మాత్రం కొంచెం బాధగానే ఉంది. 'ఈ పెద్దాయన తెలుగు మాస్టారిగా మంచిపేరు తెచ్చుకొని ఉండొచ్చుగానీ... ఆ కాలం వేరు.. ఈ కాలం వేరు... మారుతున్న కాలంతో పాటు మనుషులూ చాలా త్వరగా మారిపోతున్నారు. రాబోయే కాలం ఎలా ఉంటుందో... భగవంతుడా... నువ్వే మాకు దిక్కు... ఆమె తన కొడుకు చదువు బాధ్యతను భగవంతుడిపై వేసి ఒక్కమారు తమ కుటుంబానికి మంచి జరగాలని మొక్కుకుంది.



''చాలా థాంక్స్ తాతయ్యా...'' కళ్లలోని ఆనందం కన్నీటి పన్నీరై చిందుతుండగా రాజశేఖరం తాతయ్య రెండు చేతులూ పట్టుకుని మనస్ఫూర్తిగా చెప్పాడు.

''థాంక్స్... ఎందుకురా కన్నా... నా బుజ్జిబాబువి నువ్వు... నీకు సాహిత్యమంటే ఎంత ఆసక్తో నాకు తెలుసు. మనసులేని చదువు ఆత్మలేని శరీరం లాటిది. దానివల్ల ఎవ్వరికీ ఏ ప్రయోజనమూ ఉండదు. నువ్వు బాగా చదువుకుని నాలా తెలుగు మాస్టారివి అవ్వాలి. సరేనా!'' కళ్లు చెమరస్తుండగా ఆయన మనవణ్ణి ఒక్కమారు దగ్గరకు తీసుకుని నుదుటిపై ముద్దాడారు...

''అలాగే తాతయ్యా... నీలా గొప్పమాస్టారినే కాక గొప్ప రచయితను కూడా అవుతాను'' సంతోషంగా చెప్పాడు రాజశేఖరం. అతని మీద గొప్పకవీ, రచయితా అయిన తాతగారి ప్రభావం చిన్నప్పట్నించీ చాలానే ఉంది! ఆయన చదివే గ్రంథాలూ, ఆయన వ్రాసిన పుస్తకాలు, ఆయనకు జరిగిన సన్మానాలూ, ఆయనకొచ్చిన బిరుదులూ... ఇవన్నీ శేఖరానికి చాలాచాలా యిష్టమైన విషయాలు. గొంతెత్తి ఆయనలా పద్యాలు శ్రావ్యంగా, రాగయుక్తంగా పాడాలని పాఠాలను చక్కటి కథలుగా చెప్పాలనీ, తాతగారిలా చాలా పుస్తకాలను వ్రాసి గొప్ప పేరు తెచ్చుకోవాలని చిన్ననాటి నుండి ఓ లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నాడు రాజశేఖరం.

మొదట్లో తల్లిదండ్రుల కంతగా యిష్టం లేకపోయినా శేఖరం ప్రతి క్లాసులోనూ ఫస్టు మార్కులు తెచ్చుకోవడం, కాలేజీలో జరిగే వ్యాసరచన, వకృత్వపు పోటీల్లో, పద్య పఠనం, నాటకాలు ఒకటేమిటి అన్ని యాక్టివిటీస్‌లోనూ చురుగ్గా పాల్గొంటూ ప్రతి దాంట్లోనూ ప్రైజులు గెల్చుకోవడం వారికి అమితానందాన్ని కలిగించింది.

అతను కోరుకున్నట్లుగానే స్కూల్లో తెలుగు

పండిట్‌గా చేరి కొంతకాలానికి లెక్చరర్‌గా ప్రమోట్ అయ్యాడు. అలాగే రచనా రంగంలో కూడా తన కంటూ ఓ స్థానాన్ని సంపాదించుకున్నాడు.

అయితే అతను సాధించిన ఈ విజయాల్ని చూసి ఎక్కువకాలం ఆనందించకుండానే తాత గారూ, తల్లిదండ్రులూ గతించిపోవడం ఎప్పటికీ తీరని లోటుగానే మిగిలి పోయింది.

వర్తమానంలో కొచ్చి, కళ్ళద్దాలు తీసి చెమర్చిన కళ్లనోసారి జేబురుమాలుతో తుడుచు కున్నారా యన. ఆయనకంటూ మిగిలింది ఆయన కుటుంబం మాత్రమే. సహధర్మ చారిణి సావిత్రమ్మ గారు, యిద్దరు కొడుకులూ వారి కుటుంబాలు! అయితే ఆయనకు బాధ కలిగించే విషయం... కొడు కులిద్దరూ విదేశాల్లో స్థిరపడటం.

''పోన్లెండి... మన పిల్లల యిష్టాయిష్టాలు వేరుగా ఉండొచ్చు. మన అభిప్రాయాలను వారిపై రుద్దడం సబబుకాదు. వాళ్లకెక్కడ బాగుంటే అక్కడే ఉండనివ్వండి. మీరే చెపుతుంటారుగా మన పెద్ద వాళ్లు మనల్నెప్పుడూ బలవంతంగా ఏదీ చేయించ లేదనీ... మనమూ వాళ్లలాగే ఉండాలనీ...!'' అనే

కవిత

## చేదు నిజాలు



ఔను నిజం ఔనిది చేదునిజం
పుచ్చిపోయిన తుప్పు పట్టిన
రాజకీయ వ్యవస్థకు బానిసలం
తిన్నామా పడుకున్నామా తెల్లారిందా
లేచామా అనే తిరగబడలేని
గానుగెద్దు బతుకులకు సాక్షులం
గ్లాసుల కొద్దీ గన్నేరు పిక్కల
గరళం మింగుతునే ఉన్నాం
ఆ గ్లాసులందించిన నాయకులనే నమ్ముతున్నాం
ఎవరూ ఒరగబెట్టిందేం లేదు
అందరూ ఆ తానులో ముక్కలే
నూటికి నూరు, కోట్లు పోగేసుకున్నవారే
అడ్డుగోలుగ, దొడ్డిదారిన
కేటాయింపుల్లో, బిల్లుల్లో వాటాలు
పైరవీల పెర్సంటేజీలు
తెలిసి కూడ నీళ్ళు నములుతున్నాం
వాళ్లకేదో అన్యాయం జరిగిందనుకొని
పెట్రోలు పోసుకు తగలబడుతున్నాం
తెలిసి తెలిసీ దోపిడీదార్లను
వెనక్కు రప్పించలేకపోతున్నాం
సారాయిపోసి, పొట్లాట పెట్టి
జేబులొత్తి, చీరలు చుట్టి నరకాలు
తప్పించి నెట్టేవాడే ప్రతీ నాయకుడు
ఔనునిజం ఔనిది చేదునిజం
పుచ్చిపోయిన తుప్పు పట్టిన
రాజకీయ వ్యవస్థకు బానిసలం

– సకలాభక్తుల కృష్ణమూర్తి

వారు సావిత్రమ్మ గారు.

రాజశేఖరం గారి కొలీగ్స్ కామెంట్ చేసేది అదే! 'తమరేమో స్వదేశం, తెలుగుభాష, తెలుగు సంస్కృతి అని మాకందరికీ లెక్చర్లు దంచుతారు... మీ పిల్లలే మిమ్మల్ని 'ఫాలో' కావట్లేదుగా' అని.

ఆయనంటే చాలామందికి కంటగింపుగా ఉండేది. ఆయనో పట్టాన ఎవరిమాటా వినేవాడు కాదు. ఇప్పటి ఇంగ్లీష్ మీడియం చదువులపై మోజును, ఉచ్ఛారణ సరిగ్గా రాని మీడియా వారి తెలుగునూ... ఓ పట్టాన జీర్ణించుకోలేక పోయే వాడాయన.

తను చదువుకునే పుస్తకాలను చూసి చాలా మంది హేళన చేసేవారు. 'ఇంకా యీ పుక్కిటి పురాణాలేమిటి మాస్టారూ... ఇన్ఫర్మేషన్ కోసం ఒక్క బటన్‌నొక్కితే చాలు కావలసినంత ఇన్ఫర్మే షన్ దొరుకుతుండగా...'

పుస్తకాన్ని చేతుల్లో తీసుకుని మధ్యమధ్యలో పేజీలను, అట్టమీది బొమ్మలనూ ఆప్యాయంగా చూసుకుంటూ.... మధ్యాహ్నపు ఎండలో నీడప ట్టున కూర్చునో, చల్లటి వర్షపు జల్లు పడుతుండగా వరండాలో వాలుకుర్చీలో కూచునో చదవడంలో ఆనందమేమిటో ఆయన వారికి చెప్పడానికి ప్రయ త్నించే వారు కాదు.

తన మానాన తానేదో వ్రాసుకుంటూ వ్రాసినవి పత్రికలకి పంపుకుంటూ, అచ్చయినవి పుస్తక రూపంలో ప్రచురించుకుంటూ ఆనందించేవారు. అయితే ఆయన కొడుకులకు మాత్రం నాన్న పుస్త కాల మీద వేలకు వేలు తగలేస్తున్నట్టుగా అనిపిం చేది. 'పుస్తకాల కోసం' అంటే మాత్రం వారాయనను అదొక పనికిమాలిన పని చేస్తున్నట్టుగా చూసే వారు. ఆయన భావాలను అర్థం చేసుకునేవారు ఏ ఒకరిద్దరో ఆయన స్నేహవర్గంలో ఉండేవారు. అలాగే ఇంటర్‌స్థాయిలో జూనియర్ కాలేజీలు, ముఖ్యంగా ప్రైవేటు కాలేజీలు తెలుగును నిర్లక్ష్యం చేస్తున్నాయని బాధపడేవారు. మార్కులకోసం బల వంతంగా విద్యార్థులపై సంస్కృతాన్ని రుద్ది అసలు తెలుగే లేకుండా చేస్తున్నారని, సంస్కృతాన్ని అభి వృద్ధి చేయాలనుకుంటే మాతృభాషైన తెలుగును నిర్లక్ష్యం చేయనక్కర లేదనీ, ఇది మన రాష్ట్రానికి మాత్రమే వర్తించే వింతైన జాడ్యమనీ ఆయన ఉద్దేశం!

అంతలో అందరూ అనుకుంటున్న, ఎదురుచూ స్తున్న 'ఓల్డ్ స్టూడెంట్స్ డే' రానే వచ్చింది!

రాజశేఖరం గారు ముందు ఆ ఫంక్షన్‌కు వెళ్లకూ డదనుకున్నారు. కానీ పాత స్టూడెంట్స్ కొందరు ఆయన ఇంటికివచ్చి ఆయననూ, ఆయన సతీమణి సావిత్రమ్మ గారినీ తప్పకుండా రావాలని మరీమరీ ఆహ్వానించి వెళ్లారు. ఎక్కువగా బ్రతిమాలించుకో వడం బాగుండదని ఆయన భార్యా సమేతంగా హాజరయ్యారు.

స్టూడెంట్స్ ఒక్కొక్కరూ దాదాపు రెండేసి నిము షాల చొప్పున మాట్లాడేరు. అందరూ ఇంచుమించు డాక్టర్లూ, ఇంజనీర్లే! వారిని చూసి స్టాఫంతా చాలా సంతోషించారు.

చివరగా అభిషేక్ అనే విద్యార్థి మాట్లాడుతూ... ''మేము మీనుండి పొందిన విద్యాదానానికి గుర్తుగా ఉడతాభక్తిగా, ప్రతి మాస్టారికీ, మేడమ్‌కూ మా అభిమానం కొద్దీ చిన్నచిన్న 'గిఫ్ట్'లను ఇవ్వాల నుకుంటున్నాం. దయచేసి, డియర్ సర్స్, అండ్ మేడమ్స్ మేమిచ్చే ఈ చిన్ని కానుకలను స్వీకరించ వలసిందిగా ప్రార్థిస్తూ ఉన్నాము''

ఆ అబ్బాయీ, మరొక అమ్మాయి లిస్టు చదు వుతూ ఉంటే లెక్చరర్స్ ఒక్కొక్కరే స్టేజిమీద కొచ్చి వాటినందుకున్నారు. 'చిన్న'విగా అనౌన్స్ చెయ్య బడ్డా అవి చాలా ఖరీదైన 'గిఫ్ట్'లనే వారు గమనిం చారు. చివరగా ప్రిన్సిపాల్ గారు కూడా తన గిఫ్ట్ నందుకున్నారు.

అయితే అందరికీ ఆశ్చర్యం కలిగించిన విషయం ఏమిటంటే ఒక్క రాజశేఖరం మాస్టారి పేరు మాత్రం ఆ లిస్టులో లేదు! అందరూ యిబ్బందిగా అటూ యిటూ చూస్తూ, 'కారణం ఏమై ఉంటుందా?' అని చిన్న గొంతుతో మాట్లాడుకుంటూ ఉన్నారు. సావి త్రమ్మ గారి కన్నుల్లో నీరు తిరుగుతుండగా 'ఇక వెళ దామన్నట్టు'గా భర్తవైపు చూసారామె.

అంతలో ఆ విద్యార్థుల గుంపులోంచి ఎత్తుగా, స్ఫురద్రూపంతో, చక్కనైన చిరునవ్వుతో ఓ స్టూడెంట్ వచ్చి సభకు నమస్కరించి 'మైకు' అందు కున్నాడు.

''అందరికీ నమస్కారం! నా పేరు దీపక్. రాజశే ఖరం మాస్టారి పేరు మా లిస్టులో 'మిస్' అయ్యిం దని మీరంతా అనుకుంటున్నట్టున్నారు. మేము కావాలనే వారి పేరు ఇందులో వ్రాయలేదు!'' అన్నాడతను.

''అదే ఎందుకు వ్రాయలేదో తెలుసుకోవచ్చా?'' ప్రిన్సిపాల్ గారు కలగ చేసుకున్నారు.

దీపక్ చిరునవ్వుతో సమాధానమిచ్చాడు– ''మా చల్లని తెలుగు మాస్టారు ఎప్పుడూ మా గుండెల్లో కొలువై ఉండే దైవం కాబట్టి!''

విద్యార్థులంతా చప్పట్లు కొట్టేరు. మిగతా అధ్యాపకులు ఆశ్చర్యంతో కళ్లు పెద్దవి చేసి చూసారు.

మళ్లీ దీపక్ చెప్పాడు – ''కాలేజీలో మేము చది విన సబ్జెక్ట్స్ అన్నీ ఒక ఎత్తయితే మా రాజశేఖరం మాస్టారి తెలుగుపాఠం ఒక్కటీ ఒకఎత్తు! మాస్టారి వ్యక్తిత్వం, పంక్చువాలిటీ, డిసిప్లిన్ ఇవన్నీ మా జీవి తాల్ని తీర్చిదిద్దాయి. అమ్మచెప్పే కమ్మనైన కబుర్లు, కథల వంటి తెలుగు పాఠాలు, అమ్మపాడే తియ్యటి పాటల వంటి మాస్టారి పద్యాలూ... ఓహ్ వారు గొంతెత్తి పద్యం పాడుతుంటే గంధర్వగానం, కిన్నె రల వీణ, శివుని ఢమరుక ధ్వని... ఇలాగే ఉంటా యేమో అనిపించేది. మాస్టారు పాఠం చెబుతుంటే వెన్నెల్లో నుంచుని మల్లెల స్నానం చేసినట్టుందా... శీతాకాలపు ఉషోదయపు నులివెచ్చని కిరణాలు రాధా మనోహరాలను పలకరించి నట్టుంటుందా అంటే ఏం చెప్పాలో తెలియక అమ్మను చూస్తే చాలు కడుపు నిండిపోయినట్టు పరవశమయి పోయే పసి పిల్లలుగా మారిపోతాం అని మాత్రం

చెప్పగలం... ఆయన క్లాసులో ఉన్నప్పుడు!

మాస్టారు మాకు కేవలం పుస్తకాల్లోని పంక్తులనే కాదు... ప్రపంచ సాహిత్యాన్ని గురించీ, జీవితాలను గురించీ విడమర్చి చెప్పేవారు.... జీవితాలను చదవటం ఎలాగో... జీవితానికి గమ్యం ఏర్పరచుకోవడం ఎలాగో... ఆ లక్ష్యాన్ని ఎలా సాధించాలో నేర్పారు..'' రాజశేఖరంగారి కళ్లు ధారాపాతంగా వర్షించడం మొదలు పెట్టాయి. ఆయన తన కండువాతో కళ్లు తుడుచుకున్నారు.

అంతలో ఓ మాస్టారు కలగచేసుకుని ప్రశ్నించాడు. ''మాస్టారి గురించి చాలా బాగా చెబుతున్నావు. ఇంతకూ నువ్వేం చదివావు దీపక్? ఏ ఉద్యోగంలో సెటిలయ్యావు''.

''నేను చిన్నతనం లోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్నాను. అల్లరి చిల్లరిగా తిరుగుతున్న నాకు చదువుకుంటే బాగుపడ్తానని బోధించి... నన్ను చేరదీసి నా ఫీజులన్నీ తానే కడుతూ నన్ను చదివించింది మా మాస్టారే...'' అతనిగొంతు గద్గదమయ్యింది. ''నా ఒక్కణ్ణే కాదు సార్... మాస్టారు నాలాటి ఎందరికో యింటివద్ద ఉచితంగా చదువు చెప్పి... అవసరమైతే అన్నం పెట్టి, ఆశ్రయమిచ్చి... జీవితంలో ఓ ఉన్నత స్థానాన్ని చేరుకునేట్టు చేసారు...''

''అది సరే మరి... నువ్వేం చదువుకున్నావో చెప్పనే లేదు...'' మరొకసారి ప్రశ్నించాడో మాస్టారు.

''నిజానికి నేనొకప్పుడు ఒక యావరేజి తెలుగు మీడియం స్టూడెంట్‌ను. మాస్టారిని ఆదర్శంగా తీసుకుని ఎం.ఏ తెలుగుసాహిత్యం పూర్తిచేసి... సివిల్స్‌లో ప్రస్తుతం టాపర్‌గా వచ్చాను. త్వరలోనే పోస్టింగ్స్ తీసుకోబోతున్నాను... నా విజయానికి కారణం మా మాస్టారి ప్రోత్సాహం... ఆశీర్వాద బలం...'' దీపక్ రాజశేఖరం మాస్టారి వైపు కదిలి చటుక్కున వంగి పాదాభివందనం చేసాడు. ఆయన లేచి నిలబడి దీపక్‌ను లేవనెత్తి ఒక్కమారు బలంగా తన గుండెలకు హత్తుకున్నారు.

ఎన్నోయేళ్లకు తన తల్లిని చేరుకున్న పసిపిల్లాడిలా దీపక్ మాస్టారి గుండెలకు హత్తుకు పోయాడు. అతనికెంతో హాయనిపించింది. అతనికళ్లు వర్షిస్తుండగా చెప్పాడు ''మాస్టారూ... మేమంతా మీ పిల్లలమే... మీకెవ్వరూ తోడు లేరనుకోకండి... మీకు మేమున్నాం..'' రాజశేఖరం గారు ఆ మాటకు వెక్కి వెక్కి ఏడుస్తూ దీపక్‌ను మరింతగా గుండెలకు హత్తుకున్నారు. ఇప్పుడాయనకు తన కుమారులు తనతో లేరన్న లోటు కనిపించడం లేదు.

కాసేపటి దీపక్ తేరుకుని చెప్పాడు – ''పుంభావ సరస్వతి అయిన మా రాజశేఖరం మాస్టారికి మేము సమర్పించుకునే చిరుకానుక...'' అతనికి రెండు వైపులా ఉండే మిగతా స్టూడెంట్స్ స్టేజీ వెనక వైపున కట్టి ఉన్నా కర్టెన్‌ను నెమ్మదిగా పక్కకు తొలగించారు.

అక్కడ – తళతళలాడే రెండు నిలువెత్తు రోజ్‌వుడ్ బీరువాలు... సరస్వతీదేవి కొలువు తీరినట్లుగా... అద్దాల తలుపుల్లో నుండి అందంగా, నిండుగా అమర్చబడిన కొత్త పుస్తకాలు... కనువిందు చేస్తూ ఉన్నాయి. అందులో రాజశేఖరం గారు వ్రాసిన పుస్తకాలన్నీ కూడా సేకరించబడి ఉన్నాయి. వాటితో పాటు ప్రపంచ సాహిత్యమంతా అక్కడే కొలువు తీరిందా అన్నట్టుంది!

మళ్లీ మరో మారు ఆ హాల్లో చప్పట్లు మ్రోగాయి.

''ఒక బీరువా ఖాళీగా ఎందుకు పెట్టామో తెలుసా మాస్టారూ. భవిష్యత్తులో మీరు వ్రాయబోయే కావ్య ఖండికల కోసం'' నమస్కరిస్తూ చెప్పాడు దీపక్.

''నాయనా... దీపక్... చాలా సంతోషం నాయనా...'' సంభ్రమాశ్చర్యాలతో మాస్టారి గొంతు బొంగురుపోయింది.

''రండి మాస్టారూ... మా చిరుకానుకను స్వీకరించండి'' స్టూడెంట్స్ కొందరు మాస్టారిని, అమ్మాయిలు కొందరు సావిత్రమ్మ గారినీ చేతులు పట్టుకుని నడిపించుకుంటూ సరస్వతీ దేవి కొలువైయున్న చోటికి కదిలారు.

*

చిరునామా:
బి.వి.స్వరూప్ సిన్హా
ప్రిన్సిపాల్, **45-85-ఎ**, అప్ స్టైర్స్,
నరసింహారెడ్డినగర్,
కర్నూలు – **518 004**

